# కాంగ్రెస్‌కు ఓటేస్తే.. రైతు బతుకు ఆగమే

## నాడు-నేడు

• ఎడారిలా ఏడ్పించి..



ఒకనాడు తెలంగాణ దుస్థితికి పైచిత్రం అద్దం పడుతుంది. నాగర్‌కర్నూల్‌లోని కేసరి సముద్రం చెరువు చుక్కనీరు లేక ఇదిగో ఇలా నోర్లెళ్లబెట్టింది. పేరులో సముద్రం ఉన్నా.. రైతులకు కన్నీరే మిగిలింది. కాకతీయుల హయాంలో గొలుసుకట్టు చెరువుల్లో భాగంగా రూపుదిద్దుకున్న ఈ భారీ తటాకం ఉమ్మడి రాష్ట్రంలో చుక్కనీరు లేక నెర్రెలువారింది. నెలల తరబడి ఎడారిని తలపించేది. చెరువును నమ్ముకున్న రైతులకు చింతే మిగిలేది.

• నిండుకుండలా నవ్వించి..



స్వరాష్ట్రంలో అన్ని చెరువులకూ జల సీమంతం జరిగినట్టే.. కేసరి సముద్రం చెరువుకూ మహర్దశ పట్టింది. మిషన్ కాకతీయలో భాగంగా రూ.25 కోట్లతో చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దారు. వరుణుడు దండిగా ఆశీర్వదించడంతో కేసరి సముద్రం అచ్చంగా సంద్రాన్ని తలపిస్తున్నది. చెరువు పరిసరాలు సుందరంగా తీర్చిదిద్దడంతో విహారకేంద్రంగా అలరిస్తున్నది. ఆయకట్టు రైతులు నిశ్చింతగా సాగుబడిలో సాగిపోతున్నారు. తెలంగాణలోని చెరువుల ప్రాభవానికి 'మెచ్చు'తునక కేసరి సముద్రం.

# పచ్చని మన పల్లెల్లో 'కౌలు'చిచ్చు

> మొదటిపేజీ తరువాయి...

కేసీఆర్ ధరణిని తీసుకొచ్చి రైతన్నకు న్యాయం చేశారు. రైతు నమ్ముకున్న భూమికి భద్రత కల్పించారు. నిన్నటిదాకా రాత్రికి రాత్రి తన భూమి ఎవరి పేరు మీదకు మారుతుందోనన్న భయంతో బతికిన రైతులు.. ధరణి వచ్చిన తర్వాత గుండె మీద చేయి వేసుకొని ప్రశాంతంగా పడుకుంటున్నారు. కాంగ్రెసోళ్లకు ఇది నచ్చడం లేదు. భూమే తన సర్వస్వంగా భావిస్తున్న రైతన్నకు కంటి మీద కునుకు లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. పచ్చని పల్లెల్లో మళ్లీ 'కౌలు' చిచ్చు పెట్టేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కౌలు చట్టం తీసుకొస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రకటించారు. రైతుకు-కౌలుదారుకు మధ్య ఒప్పందం చేయిస్తామని కుండబద్దలు కొట్టారు. అంటే గుంట భూమిని కూడా తన ప్రాణం కంటే ఎక్కువగా భావించే రైతుల భూ యాజమాన్య హక్కుకే ఎసరు పెట్టేలా కాంగ్రెస్ పార్టీ ఉరితాడు పేనుతున్నదన్నమాట.

తెలంగాణలో సుమారు 1.55 కోట్ల ఎకరాల సాగు భూమి ఉన్నది. దాదాపు 69 లక్షల మంది రైతులు ఉన్నారు. గతంలో అస్తవ్యస్తంగా ఉన్న భూముల రికార్డులు, నిర్వహణను ప్రక్షాళన చేసిన తెలంగాణ ప్రభుత్వం ధరణితో వీటికి శాశ్వత రక్షణ కల్పించింది. ధరణి ఉండటం వల్లనే సాఫీగా రైతులకు రైతుబంధు అందుతున్నది. గతంలో వీఆర్వో మొదలు తాసిల్దార్ కార్యాలయం, కలెక్టరేట్, సీసీఎల్ఏ ఇలా అనేకచోట్ల ఉండే భూముల రికార్డులు ఏ రాత్రికి ఎక్కడ మారతాయో కూడా తెలియని పరిస్థితి. కానీ ఇప్పుడు ధరణి ద్వారా భూమి యజమాని అయిన రైతు వేలిముద్ర (బయోమెట్రిక్) పెడితే తప్ప బదలాయింపు సాధ్యం కాదు. అందుకే రాష్ట్రంలో ఎక్కడా భూముల తగాదాలుగానీ, సరిహద్దు పంచాయితీలుగానీ మరీ ముఖ్యంగా తలకాయలు పగులగొట్టుకునే దృశ్యాలుగానీ లేవు. అయితే కొందరు రైతులు తమ పేరిట ఉన్న భూమి అంతా స్వయంగా సాగు చేయడం లేదు. కొందరు కౌలుకు ఇస్తున్నారు. రైతు-కౌలుదారు నోటి మాటగా ఒప్పందం చేసుకుంటున్నారు. పండిన పంటలోగానీ లేదా ఎకరానికి ఇంత అని గానీ మాట్లాడుకుంటున్నారు. దీనికీ ప్రభుత్వానికీ ఎలాంటి సంబంధం ఉండదు. దీంతో ప్రస్తుతం ఎక్కడా ఎలాంటి గొడవలు లేకుండా పల్లెలు ప్రశాంతంగా ఉన్నాయి.

### కాంగ్రెస్‌కు ఓటేస్తే ఏమైతది?

- కాంగ్రెస్ తీసుకొస్తామంటున్న కౌలు చట్టం ప్రకారం.. రైతులు తమ భూమిని కౌలుకు ఇస్తే కచ్చితంగా అధికారికంగా ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది.
- రైతు ఏవో కొన్ని కారణాల వల్ల తన భూమిని కౌలుకు ఇస్తే.. కౌలుదారు పేరు కూడా ప్రభుత్వ రికార్డుల్లోకి ఎక్కుతుంది.
- భూ యజమానుల యాజమాన్య హక్కుకే ఎసరు వస్తుంది.
- రైతులకు ఆ భూమి మీద ఉన్న యాజమాన్య హక్కుకు కౌలుదారు ఎసరు పెట్టి న్యాయస్థానంలో నిలబెట్టే పరిస్థితి తలెత్తుతుంది.
- పచ్చని పల్లెల్లో మళ్లీ కౌలు చిచ్చు రాజుకుంటుంది. పల్లెల్లో ప్రశాంతత దెబ్బ తింటుంది.
- చాలామంది రైతులు తమ భూములను కౌలుకు ఇవ్వడానికి వెనకాడుతారు. దీంతో భూములు పడావు పడతాయి. వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పడిపోతాయి.
- రైతులు భూములను కౌలుకు ఇవ్వకపోతే.. కౌలు రైతులకు ఉపాధి మార్గాలు మూసుకుపోతాయి. ఈ చట్టం వల్ల కౌలు రైతులకు మేలు జరగకపోగా వ్యవసాయం చేయడానికి గుంట భూమి కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతుంది.
- భూమిని కౌలుకు ఇస్తే భూ యజమానికి రైతుబంధు అందదు.
- కౌలు చట్టం దళారీ రాజ్యానికి బాటలు వేస్తుంది. గ్రామాల్లో దళారీలు చెలరేగుతారు

#### కుంపటి పెడతామంటున్న కాంగ్రెస్

తాము అధికారంలోకి వస్తే మళ్లీ పాత రోజులు తీసుకొస్తామంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రకటనలు రైతాంగం గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఒక టీవీ చానెల్‌లో మాట్లాడుతూ... కౌలు చట్టం తీసుకొస్తామని చెప్పారు. అంటే రైతులు తమ భూమిని కౌలుకు ఇస్తే కచ్చితంగా అధికారికంగా ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో పలానా రైతు భూమిని పలానా వ్యక్తి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడనేది అధికారిక రికార్డుల్లో నమోదవుతుంది. న్యాయపరంగా కౌలుదారుకు కొంత ఆధారం వచ్చినట్లవుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తద్వారా రైతుకు కౌలుదారుకు మధ్య విబేధాలు తలెత్తుతాయి. అప్పటివరకు రైతులకు ఆ భూమి మీద ఉన్న యాజమాన్య హక్కుకు కౌలుదారు ఎసరు పెట్టి న్యాయస్థానంలో నిలబెట్టే పరిస్థితి నెలకొంటుంది. ఇలా ఒక గ్రామంలో పదుల సంఖ్యలో ఇలాంటి కేసులు నమోదు కావడం వల్ల ఇప్పటివరకు ప్రశాంతంగా ఉన్న పల్లెలు అల్లకల్లోలంగా మారతాయి. ఇలా కౌలు చట్టం తీసుకొచ్చి రైతుల పాలిట కుంపట్లు పెడతామని కాంగ్రెస్ పార్టీనే స్వయంగా చెప్తుండటం కౌలు చట్టం ద్వారా రైతుకు ఉరితాడు పేనడం తప్ప మరొకటి కాదు.

#### అనేక రూపాల్లో భారీ నష్టం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేస్తామంటున్న కౌలు చట్టంతో అధికారికంగా రైతులు-కౌలుదారు మధ్య ఒప్పందం జరగాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం జరుగుతున్నట్టుగా రైతు-కౌలుదారు పరస్పరం నోటి మాట ద్వారా సాగు చేయడమనేది ఉండదు. దీంతో తన యాజమాన్య హక్కుకే ఎసరు వస్తుందనే భయంతో ఏ ఒక్క రైతు కూడా తనకున్న భూమిని కౌలుకు ఇచ్చేందుకు ముందుకు రాడు. తనకు చేతనైతే సాగు చేస్తాడు. లేకపోతే ఆ భూమిని పడావు పెడతాడు. దీంతో ప్రభుత్వం 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నా.. వేల కోట్లు వెచ్చించి నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు ఇస్తున్నా.. రైతుబంధుతో పెట్టుబడి సాయం అందిస్తున్నా.. కౌలుదారుకు అధికారికంగా ఒప్పందం చేయాల్సి రావడంతో రైతు తన చేతనైనంత వరకే సాగు చేసి మిగిలిన భూమిని పడావు పెడతాడు. తద్వారా క్రమేణా సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోతుంది. మరోవైపు కౌలు ఇచ్చేందుకు రైతులు ఎవరూ ముందుకు రాకపోవడంతో కౌలుదారుకు ఉపాధి దొరకకుండా పోతుంది. ఇప్పుడు ప్రశాంతంగా కౌలు ద్వారా వ్యవసాయం చేసి ఆత్మగౌరవంతో బతుకుతున్న కౌలు రైతును కౌలు చట్టం ఆదుకోకపోగా అసలు వ్యవసాయానికే దూరం చేసి ఆ కుటుంబాన్ని వీధినపడేసే పరిస్థితికి తీసుకొస్తుంది. ఇలా కాంగ్రెస్ పార్టీ చెప్తున్న కౌలు చట్టం అనేక రూపాల్లో నష్టాన్ని తీసుకొచ్చి, గ్రామీణ వాతావరణాన్నే చిన్నాభిన్నం చేసే ముప్పు పొంచి ఉన్నది.





#### రైతుబంధుకు మంగళమేనా?

*కాంగ్రెస్ తెస్తామంటున్న కౌలు చట్టం ద్వారా రైతులకు ఇప్పటివరకు అందజేస్తున్న రైతుబంధుకు కూడా ఎగనామం పెట్టే ప్రమాదం ఉన్నదని పలువురు హెచ్చరిస్తున్నారు.. ఉదాహరణకు.. ఒక రైతు తనకున్న రెండెకరాల భూమిని కౌలుకు ఇవ్వడం వల్ల కౌలు రైతుకు కాంగ్రెస్ ఇస్తానంటున్న ఏడాదికి ఎకరానికి రూ.12 వేల చొప్పున రూ.24 వేలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ తరుణంలో నిజమైన యజమాని అయిన రైతుకు కూడా ఏడాదికి రూ.30 వేలు ఇవ్వాల్సి ఉంటుంది. మరి ఒకే భూమిపై ఇద్దరికి ఎలా డబ్బులు ఇస్తుంది? ఇది సాధ్యం కానందున.. సాగు చేస్తున్న కౌలుదారుకు మాత్రమే డబ్బులు ఇచ్చి అసలు రైతుకు రైతుబంధును నిలిపివేసే అవకాశం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటివరకు రైతులు రైతుబంధు పొందుతూ.. కౌలు ద్వారా వచ్చే ఎంతో కొంత మొత్తాన్ని తీసుకుంటూ ప్రశాంతంగా ఉన్నారు. కానీ కాంగ్రెస్ చెప్తున్న కౌలు చట్టం వల్ల ఒకవైపు యాజమాన్య హక్కుకు ముప్పు రావడంతోపాటు మరోవైపు రైతుబంధుకే ఎసరు రావడంతో అనేక రకాలుగా రైతులు నష్టపోతారు.*

#### మళ్లీ దళారులకు భోజ్యం

కాంగ్రెస్ చెప్తున్నట్టు కౌలు చట్టం తీసుకొచ్చి రైతు-కౌలుదారు మధ్య అధికారిక ఒప్పందం చేయిస్తామంటే అసలు దీనిని నమోదు చేసే వ్యవస్థ ఏది? ప్రస్తుతానికైతే అలాంటి వ్యవస్థ లేదు. కౌలు చట్టం తెచ్చి మళ్లీ పాత రోజులు వస్తే.. గ్రామాల్లో కౌలు రైతుల పేర్లు నమోదు, ఒప్పందాల ప్రక్రియ కోసం ప్రత్యేకంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీంతో మళ్లీ దళారుల రాజ్యం వస్తుంది. ఎలాగూ కాంగ్రెస్ కౌలు రైతులకు కూడా ఏటా ఎకరానికి రూ.12 వేలు ఇస్తానంటున్నందున కేవలం ఆ మొత్తం కోసమే బోగస్ ఒప్పందాలు తెరపైకి వస్తాయి. ప్రభుత్వ సాయం అందుతున్నందున దీనిని సాకుగా చూపి రైతు, కౌలుదారు నుంచి ఎక్కువ మొత్తం కౌలు వసూలు చేయడంతో కౌలుదారు కూడా ఆర్థికంగా నష్టపోతాడు.

# 10 హెచ్‌పీతో 60 వేల కోట్ల భారం

- 28 లక్షల మోటర్ల ఉత్పత్తికి ఐదేండ్లు
- ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలనూ కూడా మార్చాల్సిందే
- కాంగ్రెస్‌ను నమ్మితే వలస బతుకులే

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతాంగమా.. పారా హుషార్.. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రస్తుతం పండుగలా ఉన్న వ్యవసాయం వచ్చే ఐదేండ్లలో తిరిగి దండుగలా మారడం ఖాయం. కాంగ్రెస్ నేతలు చెప్తున్నట్టుగా రైతులు వ్యవసాయానికి ఉపయోగిస్తున్న 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్ల స్థానంలో 10 హెచ్‌పీ మోటర్లను బిగించుకోవడం ఆషామాషీ వ్యవహారం కాదు. ఇందుకోసం రాష్ట్ర రైతాంగం, ప్రభుత్వం మీద రూ.60 వేల కోట్ల భారం పడుతుంది. రాష్ట్రంలో ఉన్న 28 లక్షల వ్యవసాయ కనెక్షన్లను 10 హెచ్‌పీ మోటర్లుగా మార్చడానికి మోటర్లు, పైపులు, క్లాంప్‌లు, వైర్లు, స్టార్టర్, డబ్బాలు, మెకానిక్, కూలీల ఖర్చులన్నీ కలిపి తెలంగాణ రైతాంగంపై రూ.30 వేల కోట్ల భారం పడుతుంది. 10 హెచ్‌పీ మోటర్లను నడిపేలా ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలను బలోపేతానికి ప్రభుత్వం మరో రూ.30 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈలెక్కన 10 హెచ్‌పీ మోటరు పంపులకు కావాల్సిన ఈ వ్యవస్థ సిద్ధం చేసేందుకు రూ.60 వేల కోట్లు కావాలి. పైగా ఇందుకు ఐదేండ్లు పడుతుంది. దీంతో పండుగలా ఉన్న వ్యవసాయం తిరిగి 2014కు ముందునాటి 'దండగ'లా మారుతుందని విద్యుత్తు రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

#### వ్యవస్థల బలోపేతం అతి ముఖ్యం

ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్తును అందిస్తున్నది. 28 లక్షల మంది రైతులు 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లు వాడుతున్నారు. కొందరు 7.5 హెచ్‌పీ మోటర్లను ఉపయోగిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు చెప్తున్నట్టుగా వ్యవసాయానికి 3 గంటల విద్యుత్తును సరఫరా చేస్తే రైతులు 10 హెచ్‌పీ మోటర్లను బిగించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లను నడిపించుకోవడానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా వ్యవస్థలను నిర్మించారు. వీటిని తీసేసి 10 హెచ్‌పీ మోటర్లను అమర్చుకోవాలంటే డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంటుంది. విద్యుత్తు రంగ నిపుణుల అంచనా ప్రకారం.. ప్రస్తుతం ట్రాన్స్‌కో పరిధిలో ఉన్న 40,640 ఎంవీయే ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని మరో 20-25% అంటే 50,000 ఎంవీఏకు పెంచాల్సి వస్తుంది.

- డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను కూడా 50-60% వరకు అదనంగా బలోపేతం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం డిస్కంల పరిధిలో ఉన్న 8.72 లక్షల డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మ(డీటీఆర్)లలో కనీసం 5 లక్షల డీటీఆర్‌లను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంటుంది.
- ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలను బలోపేతానికి రూ.30 వేల కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇదంతా ప్రభుత్వం మీద పడబోయే అదనపు భారం.

### 10 హెచ్‌పీ మోటర్లు వాడాలంటే ఇవన్నీ చేయాల్సిందే

| ప్రస్తుతం ట్రాన్స్‌కో పరిధిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం | 10 హెచ్‌పీ మోటర్ల కోసం పెంచాల్సిన సామర్థ్యం | ప్రస్తుతం డిస్కంల పరిధిలో ఉన్న డీటీఆర్‌లు |
|---|---|---|
| 40,640 ఎంవీఏ | 50,000 ఎంవీఏ | 8.72 లక్షలు |
| **10 హెచ్‌పీ మోటర్ల కోసం అప్‌గ్రేడ్ చేయాల్సిన డీటీఆర్‌లు** | **ఇందుకు ప్రభుత్వానికయ్యే వ్యయం** | **10 హెచ్‌పీ మోటర్ల కొనుగోలుకు రైతుల మీద పడే భారం** |
| కనీసం 5 లక్షలు | రూ.30,000 కోట్లు | రూ.30,000 కోట్లు |
| **మొత్తం ఖర్చు** | | **రూ.60,000 కోట్లు** |

#### మొత్తం రూ.60 వేల కోట్లు

10 హెచ్‌పీ మోటర్ల కొనుగోలుకు రైతులపై పడే భారం రూ.30 వేల కోట్లు కాగా, అందుకు అనుగుణంగా వ్యవస్థల ఏర్పాటుకు ప్రభుత్వంపై పడే భారం మరో రూ.30 వేల కోట్లు. కాంగ్రెస్ నేతలు చెప్తున్న నూతన పథకం అమల్లోకి రావాలంటే అటు రైతులపై, ఇటు ప్రభుత్వంపై పడే భారం అక్షరాలా రూ.60 వేల కోట్లు. పోనీ దీనివల్ల రైతులకుగానీ, ప్రభుత్వానికిగానీ ఏమన్నా ఆదాయం పెరుగుతుందా? అంటే అదీ లేదు. రైతులు సాగుచేసే పంటల ఉత్పాదకతలో, పంటల దిగుబడిలో ఎలాంటి మెరుగుదల ఉండదు. ఇన్ని వేల కోట్లు ధారపోసినా రైతుల ఆదాయం కానీ, ప్రభుత్వం ఆదాయం కానీ నయా పైసా పెరగదు. దీంతో రైతులు, ప్రభుత్వం కలిపి పెట్టే ఖర్చు రూ.60 వేల కోట్లు బూడిదలో పోసిన పన్నీరవుతుంది.

#### 40 వేల కోట్లు ఖర్చుచేసిన రాష్ట్ర సర్కారు

2014కు ముందు సాగుకు 6 గంటల విద్యుత్తును అందిస్తున్నామని చెప్పిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం.. పగటిపూట 3 గంటలు, రాత్రిపూట మరో 3 గంటల విద్యుత్తును అది కూడా నాలుగైదు విడతలుగా సరఫరా చేసేది. ఏకబిగిన 6 గంటలపాటు విద్యుత్తును అందించేలా అప్పటి ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలు ఉండేవి కావు. తెలంగాణ వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ సారథ్యంలో ఆరు నెలల్లోనే 9 గంటలపాటు రాష్ట్రమంతటా నిరంతరాయంగా విద్యుత్తును 19 లక్షలకుపైగా ఉన్న వ్యవసాయ కనెక్షన్లకు అందించేలా తాత్కాలికంగా తీర్చిదిద్దారు. ఆ తర్వాత 2018 జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల విద్యుత్తును అందించేలా ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలను బలోపేతం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.40 వేల కోట్లు ఖర్చు పెట్టింది. విద్యుత్తు వ్యవస్థలను బలోపేతం చేయడానికి అంత డబ్బుతోపాటు నాలుగున్నర ఏండ్ల సమయం పట్టింది. రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్తు శాఖ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తేనే అది సాధ్యమైంది. ఆ వ్యవస్థలను 10 హెచ్‌పీ మోటర్లను ఉపయోగించేలా మరింత బలోపేతం చేయడం అంత ఈజీ కాదు. ఎందుకంటే, మనకు కావాల్సిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను, డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్లను డిజైన్ చేసి, వాటి సామర్థ్యాలను బట్టి దేశవ్యాప్తంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ కంపెనీలకు ఆర్డర్ ఇవ్వాలి. ఆయా కంపెనీలు వాటిని తయారు చేయడానికి సంవత్సరాలు పడుతుంది. వీటిని తీసుకొచ్చి బిగించడానికి మరికొంత సమయం కావాలి. ఎంత వేగంగా చేసినా కనీసం ఐదేండ్లు పడుతుందని నిపుణుల అంచనా.

#### ఇక వ్యవసాయం దండగే

*కాంగ్రెస్ నేతలు చెప్తున్నట్టుగా 10 హెచ్‌పీ మోటర్లు బిగించి, అందుకు అనుగుణంగా విద్యుత్తు వ్యవస్థలను మార్చడానికి రూ.60 వేల కోట్లు, ఐదేండ్ల సమయం పడితే.. అప్పటికే వ్యవసాయం కుప్పకూలుతుంది. మళ్లీ దండగ అనుకునే పరిస్థితి వస్తుంది. సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల కరెంటు, రైతుబంధు ఇస్తుండటంతోపాటు కొత్త ప్రాజెక్టులతో భూగర్భ జలాలు భారీగా పెరిగి రాష్ట్రంలోని 28 లక్షల వ్యవసాయ మోటర్లు నిర్విరామంగా నడుస్తున్నాయి. దీనితో రైతులు రెండేసి పంటలను పండిస్తున్నారు. తెలంగాణ దేశానికే అన్నంపెట్టే స్థాయికి ఎదిగింది. పంజాబ్‌ను తలదన్ని 2022-23 వ్యవసాయ సీజన్‌లో మొత్తం 3 కోట్ల టన్నుల ధాన్యాన్ని పండించారు తెలంగాణ రైతాంగం. కాంగ్రెస్ నేతల మాటలు నమ్మితే.. ఐదేండ్ల పాటు వ్యవసాయం కునారిల్లుతుంది. బీడుభూములు పెరుగుతాయి. పంటల దిగుబడి పడిపోతుంది. రైతులకు అప్పులే మిగులుతాయి. బతకడానికి మళ్లీ వలసల బాటన పట్టాల్సిన దుస్థితి దాపురిస్తుంది. ముంబై, దుబాయి, బొగ్గుబాయి వైపు వెళ్లాల్సిన పరిస్థితులు తలెత్తుతాయి. ఆ బాధలు మళ్లీ అవసరమా? తెలంగాణ రైతులు సీరియస్‌గా ఆలోచించాల్సిన సమయమిది.*

• చెప్పులు కుట్టి.. ఓట్లు అభ్యర్థించి



మంత్రి, ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని పలు డివిజన్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్మకారుడి వద్ద చెప్పులు కుట్టి, టీ కొట్టు వద్ద చాయ్ చేసి, పాన్‌షాపు వద్ద పాన్ కట్టి ప్రచారం చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. - ఖమ్మం

# అభ్యర్థుల పేరున పెండింగ్ చలాన్లు

#### ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న నేతలు

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థులు ప్రచార పర్వంలో దూసుకెళ్తున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ రాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్‌లు చేస్తున్నట్టు ట్రాఫిక్ పోలీసులు తాజా చలానాల్లో వెల్లడైంది. నామినేషన్ దాఖలుకు ముందు అభ్యర్థులు ప్రభుత్వ అన్ని బకాయిలను చెల్లించాలి. ట్రాఫిక్ చలాన్లు సైతం అభ్యర్థులు క్లియర్‌చేశారు. కానీ, ప్రచారంలో భాగంగా అభ్యర్థుల కార్లు అనధికార పార్కింగ్, రాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, స్టాప్‌లైన్ క్రాసింగులకు పాల్పడ్డాయని ట్రాఫిక్ పోలీసుల రికార్డులు చెప్తున్నాయి. ఇలా అభ్యర్థుల పేరున పెండింగ్ చలాన్లు ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్, బీఆర్ఎస్ అభ్యర్థి వీ సునీతారెడ్డి, బీజేపీ అభ్యర్థి ఎన్ రామచందర్ రావు, ఎంఐఎం అభ్యర్థి మీర్ జుల్ఫికర్ అలీ కార్లకు ట్రాఫిక్ చలానాలు పెండింగులో ఉన్నాయి. నిజామాబాద్ రూరల్ బీజేపీ అభ్యర్థి దినేశ్‌కుమార్ నాలుగు కార్లపై అత్యధికంగా చాలాన్లు ఉన్నాయి. ఆయన రూ.12 వేల జరిమానా చెల్లించాల్సి ఉన్నది. మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయ నేతలు అనే తేడా లేకుండా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన అందరికీ తాము చలాన్లు వేస్తున్నట్టు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.